# అంతర్జాతీయ కవితా దినోత్సవం- 21/03/13

## 'కవి'త

—ప్రభుల ఇంటి సుబ్బారావు

మధురమైన తెలుగు అక్షరాలని
నొంపైన పదాలుగా పేర్చుకుని
భావ పరిమళాన్ని పదిమందితో
పంచుకునేది కవిత

కోరమీసపు కసిని
నునుబుగ్గల సిగ్గును
కలిపే సప్తవర్ణ శోభిత
ప్రణయ కవిత

బాధాతప్త హృదయాలకు
సాంత్వన చేకూరుస్తూ
మనసు గాయాలకు మంచిగంధపు
లేపనం పూసే చల్లని కవిత

ఉద్యమాలకు ఊపిరై
కదం తొక్కేవారిని రణాన నిలిపి
వారి చేతిలో నింగినంటే బావుటాగా నిలిచి
అరుణిమను జగానికి పూసే విప్లవ కవిత

ఉగాదిని ప్రకృతి పల్లకిలో మోసుకొస్తూ
సంక్రాంతి సంబరాలను హృదయాల్లో నింపుతూ
దసరా సరదాలకు పరదాలు తీసి
కాలాన్ని కలంతోదున్నే నిరంతర శ్రామిక కవిత

అక్షరాభ్యాసంతో శైశవాన్ని
వ్యక్తిత్వ వికాసంతో యువతని
ఆధ్యాత్మిక భావాలతో వృద్ధాప్యాన్ని
అలరించే ఆబాలగోపాల స్నేహ పరిమళ కవిత

ఎల్లలపై నిలిచే వీరజవానులకి
మన పర ఎల్లలు లేకుండా పోరాడే సహృదయులకి
జాతి మతాలు కులాలేవైనా మనుషుల మానవత్వానికి
సంస్కారంతో నమస్కారంగా నిలిచే మనోవికసిత కవిత

సినీగీతాలైన
గీతాసారమైనా
కాగితంపై కలం వాలిందంటే
అది అక్షర కవితా జీవనదే

అగ్గిపుల్లైనా..కుక్కపిల్లైనా
గుడిసె బ్రతుకైనా..మేడ బడాయి అయినా
సగటు మానవుడిబ్రతుకైనా
కాదేది కవితకనర్హమన్నది నిజం

మనసు కదిలినప్పుడు..కలవరమైనప్పుడు
ప్రసవ వేదనతో కవితకు జన్మనిచ్చి
సమాజ పోకడను చరిత్రలో సాక్ష్యాలుగా నిలిపే
ఎందరో కవిబ్రహ్మల కరకలములకు ప్రణామాలు!

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు
9393981918